క్లుప్తంగా

19న మిర్యాలగూడలో 'జల్సా'



మిర్యాలగూడలో జల్సా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముస్లిం మత పెద్దలు

మిర్యాలగూడ : మిర్యాలగూడ పట్టణంలోని ఉస్మానియా మసీద్‌లో మౌలాన అతికుల్ రెహమాన్ ఆధ్వర్యంలో ఈనెల 19న అజీమిస్ షాన్ జల్సా నిర్వహిస్తున్నట్లు మత పెద్దలు హఫీజొద్దిన్ పాషా, అహ్మద్‌చావుష్ తెలిపారు. బుధవారం స్థానిక ఉస్మానియా మసీదులో జల్సా పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ జల్సాకు గుజరాత్‌కు చెందిన మత పెద్దలు మౌలానా సలావుద్దిన్‌సైఫీ పాల్గొంటారన్నారు. 19న సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఈ జల్సా కొనసాగుతుందన్నారు.ఈ కార్యక్రమానికి ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండి.ఇస్మాయిల్, అంజాద్‌బాబా, తౌఫిక్, కమిటీ సభ్యులు మొహమ్మద్ రఫీక్, హఫీజ్, అబ్దుల్ మన్నాన్, పాషా, షఫి, జుబేర్, సాధిక్, షరీఫ్, సుల్తాన్ పాల్గొన్నారు.

క్రికెట్ కిట్టు అందజేత



క్రికెట్ కిట్టు అందజేస్తున్న దినేష్

డిండి: మండల పరిధిలోని గోనబోయనపల్లి క్రీడాకారులకు బుధవారం ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి పున్న దినేష్ క్రికెట్ కిట్టును అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు క్రీడల్లో యువత రాణించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీను, వెంకటేష్, మల్లేష్, సత్యనారాయణ, అనిల్‌కుమార్, దామోదర్ తదితరులున్నారు.

సుందరయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడలో ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు, మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రేపల్లి వెంకటేశ్వర్లు, జగదీష్‌చంద్ర, రవినా యక్, మల్లు గౌతంరెడ్డి, బాండ్ల పాండు, శశిధర్‌రెడ్డి, వినోద్ నాయక్, అయూబ్, మంగారెడ్డి, రామ్మూర్తి, అంజాద్, శ్రీనివాస్, పాపిరెడ్డి, రాంరెడ్డి, జగన్ నాయక్ తదితరులున్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

చింతపల్లి : మండలంలో ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ శ్రీలక్ష్మి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు కుర్మేడు, మాల్‌గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువుల దుకాణాల నిర్వాహకులు రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే విక్రయించాలన్నారు. రైతులు దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు విక్రయించే సమయంలో తప్పనిసరిగా రశీదు పొందాలని సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు మండలి చైర్మన్ పరామర్శ



కనీలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

దేవరకొండ: దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్‌ను బుధవారం శాసన మండలి చైర్మన్ గుత్తా ఖేందర్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల రవీంద్రకుమార్ తండ్రి కనీలాల్ అనారోగ్యంతో మృతిచెందారు. దేవరకొండ మండలం రత్యతండాలో రవీంద్రకుమార్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను గుత్తా సుఖేందర్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పౌరసరఫరాల శాఖలో పని చేసి ఉద్యోగ విరమణ తర్వాత సర్పంచ్‌గా ఎన్నికైన కనీలాల్ గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు.అనంతరం కనీలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వీధి వ్యాపారులకు అండగా..

- అర్హులైన వారికి పీఎం స్వనిధి రుణాలు
- సకాలంలో చెల్లిస్తే రెట్టింపు రుణం

హాలియా : వీధి వ్యాపారులకు అండగా నిలువాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భర్ భారత్ (పీఎం స్వనిధి) పథకాన్ని అమలు చేస్తోంది. మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలో 1100 మంది చిరు వ్యాపారులను ప్రత్యేక సర్వే ద్వారా గుర్తించింది. వారికి ఐడీ కార్డులతో పాటు స్ట్రీట్ వెండర్స్‌గా సర్టిఫికెట్లు సైతం అందజేసింది. ఇందులో అర్హులైన వారికి బ్యాంకుల ద్వారా రుణాలను అందజేస్తూ..ఆర్థిక చేయూతనంది స్తోంది. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించే వ్యాపారులకు రెట్టింపు రుణాన్ని అందజేస్తున్నారు.

నాలుగేళ్ల నుంచి..

కోవిడ్ మహమ్మారీతో ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్న చిరువ్యాపారులను ఆర్థిక తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో 2020 మార్చిలో కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. మెప్మా ద్వారా ఇలాంటి వారి గుర్తింపు కోసం ప్రత్యేక సర్వే చేపట్టింది. ప్రతీ వ్యాపారికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించాలని సంకల్పించింది. ఇప్పటి వరకు మూడు విడతలో రుణాలను అందజేశారు.



పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్న మహిళ

సకాలంలో చెల్లిస్తే..

ఈ పథకం కింద తీసుకున్న రుణాన్ని ఏడాదిలోపు ఏడు శాతం వడ్డీతో బ్యాంకులకు తిరిగి చెల్లించాల్సిన ఉంటుంది. నిర్ణీత గడువులోగా సక్రమంగా చెల్లించిన వారికి మలివిడతకు అర్హులుగా గుర్తించి రెట్టింపు రుణం అందజేస్తున్నారు. తొలి విడతలో రూ.10వేలు, మలి విడతలో రూ.20వేలు రుణాలివ్వగా, మూడో విడతలో రూ.50వేలను అందించే ప్రక్రియ సాగు తోంది. తొలి విడతలో 747 మందికి రుణాలను అందజేయగా మలివిడతలో 316 మందికి రూ.20వేల చొప్పున రుణాలను అందజేశారు. ఇలా మొదటి, రెండో విడతలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన వారికి మూడో విడత కింద రూ. 50వేల చొప్పున రుణమందిస్తున్నారు. ఈ విడతలో 95 మంది దరఖాస్తు చేసుకోగా 70మందికి రుణాలను మంజూరు చేశారు. ఇందులో 68 మందికి రుణాలను అందజేశారు. మిగతా వారికి రుణాలు అందించే ప్రక్రియ కొనసాగుతోంది.

రూ.50వేల రుణం మంజూరైంది



ఆత్మనిర్భర్ భారత్ పథకం కింద నాకు మొదటి, రెండో విడత మంజూరైన రుణంతో వ్యాపారం చేసుకుంటున్నా. తీసుకున్న రుణాలను నిర్ణీత గడువులోగా బ్యాంకులో తిరిగి చెల్లించడం వల్ల మూడో విడత కింద రూ. 50వేల రుణం మంజూరైంది. దీంతో నా వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటా.

–గోపిశెట్టి అనిత, వీధి వ్యాపారి, హాలియా

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

- రూ. 3.28 కోట్లతో నిర్మాణం
- ఇప్పటికే అప్రోచ్ రోడ్డు పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

మాడుగులపల్లి : మండలంలోని ఆగామోత్కూర్ శివారులో పాలేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు వాగుకు వరద వచ్చి లోలెవల్ వంతెన పైనుంచి నీరు ప్రవహించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఉండేవి. పరిసర గ్రామాలైన చర్లపల్లి, భీమనపల్లి, బొమ్మకల్లు, కల్వేలపాలెం గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవి. ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉండడంతో వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు గత ప్రభుత్వానికి విన్నవించగా.. మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు చొరవ తీసుకొని పంచాయతీ రాజ్ నిధులు రూ. 3.28 కోట్లు మంజూరు చేయించారు. గతేడాది అక్టోబర్ మొదటి వారంలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి మేఘా కన్‌స్ట్రక్షన్ సంస్థకు పనులు అప్పగించారు. ఆ వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో పనులు షురూ అయ్యాయి. 2025 ఏప్రిల్ నాటికి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. వర్షాలు కురిసి వాగుకు వరద వస్తే గడువు కొంత పెరిగే అవకాశం ఉందని పంచాయతీరాజ్ ఏఈ నరేష్ తెలిపారు. వంతెన పనులు ప్రారంభం కావడంతో స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆగామోత్కూర్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్న ప్రాంతం, పక్కన అప్రోచ్ రోడ్డు

ప్రజా చైతన్య బావుట 'పొలిశెట్టి'

వేములపల్లి : ప్రజానాట్య మండలి కళాకారుడు పొలిశెట్టి లింగయ్య ప్రజాచైతన్య బావుట అని మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ అన్నారు. గురువారం పొలిశెట్టి లింగయ్య 12వ వర్ధంతి సందర్భంగా మండలంలోని సల్కునూరు అడ్డరోడ్డులో ఉన్న ఆయన స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. లింగయ్య అనేక సినిమాలకు పాటలను అందించిన గొప్ప కవి, గాయకుడు అని తెలిపారు. కార్యక్రమంలో కందుకూరు సుదర్శన్, నర్సింగోజు రవి, నకిరేకంటి కిరణ్‌కుమార్, బాలునాయక్, ప్రతాప్, శ్రీనివాస్, నాగిళ్ల కొండలు, శోభన్‌బాబు, మధు ఉన్నారు.



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న పాల్ తదితరులు

గురువును కలిసిన జానారెడ్డి



గురువు సుబ్బారావును పలకరిస్తున్న జానారెడ్డి

మిర్యాలగూడ: సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి తన గురువైన మానవ హక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు పొన్నూరు సుబ్బారావును బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా గురు శిష్యులిద్దరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. జానారెడ్డి తన గురువు సుబ్బారావు ఆరోగ్యం, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

హామీలు అమలు చేయాలి

చండూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం చండూరులో నిర్వహించిన సీపీఎం ముఖ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసినవారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ గౌడ్, చిట్టిమల్ల లింగయ్య, రవి, గౌసియా బేగం, నరసింహ పాల్గొన్నారు.

శ్రీ బాలాజీ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

మిర్యాలగూడ అర్బన్: మెడ స్టిఫ్‌నెస్ కోల్పోయిన రోగికి మిర్యాలగూడ పట్టణం డాక్టర్స్ కాలనీలోని శ్రీ బాలాజీ న్యూరోకేర్ అండ్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ పోషం సునీత, గోపీనాథ్ బుధవారం వివరాలు వెల్లడించారు. దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామానికి చెందిన కసిరెడ్డి మంగమ్మకు ఇటీవల జ్వరం వచ్చింది. ఆమె తన మెడను నిల్పలేక అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను మంగళవారం శ్రీ బాలాజీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. న్యూరో ఫిజిషియన్ డాక్టర్ అభిషేక్ ఆమెను పరీక్షించి పయోజెనిక్ మెనైంజైటిస్ వ్యాధిగా నిర్ధారించారు. వైద్య బృందం ఐదు గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స చేసి మంగమ్మ మెదడులో రక్తం గడ్డలు, నీరు తొలగించి ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు.



శస్త్రచికిత్స అనంతరం పూర్తిగా కోలుకున్న మంగమ్మతో ఆస్పత్రి వైద్య బృందం

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని పీపీఆర్ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, సీపీఐ నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. సన్నాహక సమావేశానికి నాయకులు, గ్యాడ్యుయేట్లు హాజరుకావాలని కోరారు.

విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి : దేవరకొండ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించే కాంగ్రెస్ దేవరకొండ నియోజకవర్గ స్థాయి ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

సమావేశాన్ని జయప్రదం చేయాలి

హాలియా : హాలియా పట్టణంలో గురువారం నిర్వహించనున్న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో ఉదయం 11. 30 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న హాజరువుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఐఎన్‌టీయూసీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త

- ప్రకటనలు చూసి మోసపోవద్దు
- బిల్లులు భద్రపర్చుకోవాలి
- రైతులకు వ్యవసాయ అధికారుల సూచనలు

దేవరకొండ: ఆరుగాలం శ్రమించినా ఫలితం దక్కాలంటే అన్నదాత ఆదినుంచే అప్రమత్తంగా ఉండాలి. దుక్కిదున్నింది మొదలు పంట చేతికొచ్చే వరకు సాగుకు సంబంధించి అన్ని జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుత సీజన్‌లో రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేస్తున్నారు. ఈ సమయంలో రైతులు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉండరాదని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొని మోసపోవద్దని అధికారులు సూచిస్తున్నారు.

విత్తనాలు కొనేముందు..

వ్యవసాయశాఖ లైసెన్స్ పొందిన డీలరు నుంచే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి.సరిగా సీల్ చేసి ఉన్న బస్తాలను ధృవీకరణ పత్రం(ట్యాగ్) ఉన్న వాటినే ఎంపిక చేసుకోవాలి. బస్తా, ప్యాకెట్‌పై గడువు తేదీ, రకం పేరు, లాట్ నంబర్లను గమనించాలి. కొనుగోలు బిల్లుతో పాటు నంబరు, విత్తనరకం, గడువు తేదీ ఉండేలా డీలర్ సంతకంతో కూడిన రశీదు పొందాలి. రైతు సంతకం కూడా బిల్లుపై ఉండేలా చూసుకోవాలి.ప్రైవేట్ విత్తన సంస్థలు పెద్ద ఎత్తున చేసే ప్రచారానికి ఆకర్షితులై విత్తనాలు కొనుగోలు చేయరాదు. విత్తనాన్ని ఎంచుకునే ముందు వ్యవసాయ అధికారి, శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవడం మంచిది. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేసిన విత్తనాలు ఉంటే వాటినే తీసుకోవడం ఉత్తమం.ఎరువులను కూడా లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనాలి. రైతులు తాము కొనుగోలు చేసిన ఎరువులకు సంబంధించి సరైన బిల్లులు పొందాలి. డీలర్ బుక్‌లో రైతు విధిగా సంతకం చేయాలి. మిషన్‌కుట్టు ఉన్న ఎరువుల బస్తాలు మాత్రమే కొనాలి. సీసంతో సీల్ ఉందో లేదో నిశితంగా పరిశీలించి చూడాలి. బస్తాపై ప్రామాణిక పోషకాలు, ఉత్పత్తిదారుల వివరాలు ఉండాలి. కొనుగోలు చేసిన ఎరువుల విషయంలో అనుమానం వస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పురుగుల మందులు

చీడపీడల నివారణకు వాడే క్రిమిసంహారక మందుల విషయంలో కూడా చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వ్యవసాయశాఖ సూచించే మందులను మాత్రమే కొనాలి. లైసెన్స్ లేని దుకాణాల నుంచి కొనరాదు.అవసరానికి మించి కొని నిల్వ చేసుకుంటే మందులు చెడిపోతాయి. లేబుల్ లేని మందు సీసా, ప్యాకెట్, డబ్బాలను కొనరాదు. లేబుల్ మీద ప్రకటించిన మందు పేరు, మందు శాతం, పరిమాణం, విష ప్రభావం తెలిపే గుర్తులు, వాడకంలో సూచనలు, జాగ్రత్తలు, విరుగుడు మందులు, బ్యాచ్ నంబర్, వాడాల్సిన గడువు, తయారు చేసిన సంస్థ పేరు, రిజిస్ట్రేషన్ విషయాలు పరిశీలించాలి. సదరు రైతులు ఇందుకు సంబంధించి అన్ని వివరాలతో కూడిన బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి



విత్తనాలు,ఎరువులు,పురుగు మందుల కొనుగోలు సమయంలో ముందు జాగ్రత్త అవసరం. విత్తనాల ఖాళీ ప్యాకెట్లు, సంచులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచి ఉంచాలి. సరిగా మొలవక పోవడం, పంట దిగుబడి రాకపోవడం లాంటి సమస్యలు వస్తే కంపెనీ నుంచి పరిహారం పొందవచ్చు. రైతులు కొనుగోలు చేసిన ఎరువుల విషయంలో అనుమానం వస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలి.

–శ్రీలక్ష్మి, ఏడీఏ, దేవరకొండ

పౌష్టికాహారం అందజేయాలి

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి సక్కుబాయి తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం పాలు, గుడ్లను పరిశీలించారు. మెనూ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. ఆమె వెంట సీడీపీఓ అన్జుమ్, సూపర్‌వైజర్ సునిత, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, సూర్యకళ ఉన్నారు.

ఇటుక బట్టీలను తొలగించాలని వినతి



మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌నగర్ కాలనీ ప్రజలు

మిర్యాలగూడ : మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామపంచాయతీలో ఉన్న ఇటుక బట్టీలను తొలగించాలని కాలనీ ప్రజలు కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు వెళ్లే దారిని సైతం ఇటుక బట్టీల యాజమాన్యం ఆక్రమించడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఇటుకబట్టీల వల్ల తినే ఆహారంలో, తాగునీటిపై దుమ్ము, బూడిద పడుతుందని, తమ ఆరోగ్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఇటుకబట్టీలను తొలగించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, లేనట్లయితే శ్రీనివాస్‌నగర్ నుంచి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వరకు పాదయాత్ర చేసి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముడావత్ జగన్, వీరన్న, నుమాన్, జావిద్, పర్వేస్, బిస్మిల్లా, తరుణ్, మోహన్ పాల్గొన్నారు.

జంకుతండాలో తాగునీటి సమస్య పరిష్కరించాలి



పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం జంకుతండాలో తాగునీటితో పాటు విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సత్యప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కనపర్తి సత్యప్రసాద్ మాట్లాడుతూ జంకుతండా గ్రామ పంచాయతీలో ప్రజలు ప్రధానంగా డ్రెయినేజీ, విద్యుత్, తాగునీటి సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారని, పంచాయతీ అధికారులు, స్పెషల్ అధికారులు తక్షణమే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో బీజేపీ నాయకులు విజయనాయక్, కిషన్ నాయక్, కో ఆర్డినేటర్ నరేష్‌నాయక్, సుబ్రమాణ్యం రాజు, అంజి, మల్లేష్ తదితరులున్నారు.

- పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హాలియాలోని నిర్మల ఉన్నత పాఠశాలలో సమవేశమైన ఇదే పాఠశాలలో 2006-07 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు

జనావాసాల నడుమ మురుగు



కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని 9వ వార్డులో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

- దుర్గంధంతో అసౌకర్యానికి గురవుతున్న ప్రజలు
- మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని వినతి

కొండమల్లేపల్లి : ఇక్కడ కుంటను తలపిస్తున్న మురుగునీరు కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని 8వ, 9వ వార్డులోనిది. ఇళ్ల నుంచి వచ్చే మురుగంతా ఇలా నివాసాల మధ్య చేరి కుంటను తలపిస్తోంది. దీంతో ఆయా వార్డు ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మురుగు నీరు వెళ్లడానికి రోడ్డు పక్కనే పెద్ద కాలువ మాదిరిగా గుంతను తవ్వి అందులోకి వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. కానీ చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగు పేరుకుపోయి దుర్గంధాన్ని వెదజల్లుతుందని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి వీరబాబును వివరణ కోరగా సిబ్బందితో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.గ్రామపంచాయతీ అధికారులు స్పందించి దోమలు, ఈగలు ప్రజబలకుండా, మురుగు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.



చెత్తాచెదారంతో పేరుకుపోయిన మురుగు

పిడుగు పాటు బాధితులకు తహసీల్దార్ పరామర్శ

త్రిపురారం : మండలంలోని నీలాయిగూడెంలో మంగళవారం పిడుగు పాటుకు గురై నల్లగొండ మంలంలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన మర్రి రిషి మరణించడంతో పాటు నీలాయిగూడేనికి చెందిన చాగంటి సిద్దార్థ, దైవం ప్రదీప్‌కు తీవ్రగాయాలయ్యాయి. బుధవారం త్రిపురారం తహసీల్దార్ గాజుల ప్రమీలా పిడుగు పాటుతో గాయాలైన బాధితుల ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకొని పరామర్శించారు. అనంతరం కటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన జెర్రిపోతుల సతీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న గ్రామ అంబేద్కర్ యూత్ కమిటీ సభ్యులు అతడికి బుధవారం రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన రెమడాల భిక్షానికి సైతం కాలుకు గాయం కాగా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో దశరథ్, సురేందర్, ప్రవీణ్, సతీష్, వెంకట్, శంకర్ పాల్గొన్నారు.



సతీష్‌కు నగదు అందజేస్తున్న యూత్ సభ్యులు